www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 2 సంచిక -214 గురువారం17 అక్టోబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

# ఇంత అప్పులు తెచ్చి దేనికి ఖర్చు చేశారు?

**రికార్డు స్థాయిలో ప్రభుత్వం అప్పులు**

**10 నెలల్లో రూ.80,500 కోట్లు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
రేవంత్ రెడ్డి గద్దె నెక్కిన రోజు నుంచి పది నెలల్లో రూ.80,500 కోట్ల అప్పు తెచ్చారని, రికార్డు స్థాయిలో అప్పులు తెచ్చి దేనికి ఖర్చు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. అప్పు చేయడమే తప్పు అన్నోళ్లను ఇప్పుడు దేనితో కొట్టాలని ప్రశ్నించారు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కట్టలేదని.. ఎన్నికల హామీలు నెరవేర్చలేదని.. అలాంటప్పుడు అప్పు తెచ్చిన రూ.80 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకు ఆ మొత్తం ధారాదత్తం చేశారా? కమీషన్లకు కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులతో ప్రాజెక్టులు నిర్మించామని, ప్రతి పైసా మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేశామన్నారు. తెచ్చిన అప్పులతో దశాబ్దాల కష్టాలు తీర్చామన్నారు. రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా ఇవ్వకుండా.. ఒక్క ప్రాజెక్టు కట్టకుండా.. నెలల పాటు జీతాలు ఇవ్వకుండా ఇన్ని వేల కోట్లు ఏం చేశారని నిలదీశారు. రాష్ట్రంలో సంపద సృష్టించే ప్రయత్నం చేయకుండా సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరమన్నారు. ఈ అప్పులు రాష్ట్ర భవిష్యత్ కే పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.



## తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



2లో.

వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం నియామకం

ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు

## ఉగ్రవాదంపై పాకిస్థాన్‌కు జైశంకర్ చురకలు



2లో.

ఇస్లామాబాద్‌లో జరుగుతున్న ఎస్‌సీఓ సదస్సు

భారత ప్రతినిధి బృందానికి మంత్రి జైశంకర్ సారథ్యం

ఈ సమావేశంలో ఉగ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి

## మా అప్పు 49,618కోట్లే!



**అప్పులు, ఖర్చుల లెక్కలపై కేటీఆర్‌కు భట్టి సమాధానం ...!**

**రూ.80 వేల కోట్లకు పైగా అప్పులు చేసి**

**ఈ ప్రభుత్వం ఏం చేసిందని కేటీఆర్ ప్రశ్న**

**అప్పులు, ఖర్చుల లెక్కలపై ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం కార్యాలయం**

**డిసెంబర్ నుంచి రూ.56 వేల కోట్ల పాత అప్పులు, వడ్డీలు**

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎడాపెడా అప్పులు చేస్తోందంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తోన్న ఆరోపణలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. తమ ప్రభుత్వం ఏర్పాటు వచ్చాక చేసిన అప్పులు, వ్యయానికి సంబంధించిన వివరాలతో డిప్యూటి సీఎం ప్రకటన విడుదల చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక తీసుకున్న రుణాలు, తిరిగి చెల్లించిన వడ్డీ కలిపి మొత్తం (డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 15, 2024 వరకు) వివరాలను పేర్కొన్నారు.తమ ప్రభుత్వం వచ్చాక తీసుకున్న రుణం రూ. 49,618 కోట్లు కాగా గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన రుణాల అసలు,వడ్డీని కలిపి రూ.56,440 కోట్లు చెల్లించినట్టు పేర్కొన్నారు. ఇదే కాకుండా తమ ప్రభుత్వం మూలధనం కింద రూ.21,881 కోట్లు ఖర్చు చేయడంతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యతగల పథకాలతో పాటు రైతుల రుణమాఫీ, రైతు భరోసా, చేయూత, ఎల్‌పిజి సిలిండర్లపై సబ్సిడీ, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద, బియ్యంపై సబ్సిడీ, స్కాలర్ షిప్స్, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలు అన్నింటిపై డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 వరకు మొత్తం రూ.54,346 కోట్లు ఖర్చు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక

**డీఏను 3 శాతం పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం**




**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కేంద్రం పెంచింది.

మిగతా 2లో.

# వెళ్లి తీరాల్సిందే..

**ప్రస్తుత రాష్ట్రాల్లోనే కొనసాగించాలన్న అధికారుల విజ్ఞప్తి... కోర్టులో దక్కని ఊరట**




**ఏపీ నుంచి రిలీవ్ అయిన సృజన, హరికిరణ్, శివశంకర్**

**తెలంగాణ నుంచి వాణీప్రసాద్, కరుణ, రోనాల్డ్ రాస్, ఆమ్రపాలి రిలీవ్**

# హైడ్రా ఏర్పాటుకు హైకోర్టు క్లీన్ చిట్

- హైడ్రాపై పురపాలక శాఖ కీలక ఉత్తర్వులు
- జీహెచ్ఎంసీ చట్టంలోని విశేషాధికారాలను కల్పిస్తూ ఉత్తర్వులు
- ఈటీవలే హైడ్రాపై ఆర్డినెన్స్ తెచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- అంతకుముందు, హైడ్రా ఏర్పాటుకు హైకోర్టు క్లీన్ చిట్

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
హైడ్రాపై పురపాలక శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలోని విశేషాధికారాలను హైడ్రాకు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఇప్పుడు పురపాలక శాఖ విశేషాధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. హైడ్రాకు హైకోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. హైడ్రా పేరుతో జరుగుతున్న కూల్చివేతలపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



హైడ్రా పేరుతో జరుగుతున్న కూల్చివేతలను ఆపివేయాలని హైకోర్టుకు వెళ్లగా... న్యాయస్థానం క్లీన్ చిట్ ఇచ్చింది. హైడ్రా ఏర్పాటును తప్పుపట్టలేమని హైకోర్టు వెల్లడించింది. దీనిని ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా నిజాం కాలంనాటి రెవెన్యూ చట్టాన్ని ప్రస్తావించింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# వెళ్లి తీరాల్సిందే..

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
తమ కేడర్ రాష్ట్రానికి వెళ్లేందుకు ససేమిరా అంటున్న ఐఎఎస్ అధికారులకు హైకోర్టులోనూ చుక్కెదురైంది. దీం తోవరుసగా వీరికి డిఒపిటి, క్యాట్, హైకోర్టు రూ పేణా దెబ్బ మీద దెబ్బ తగిలింది.. క్యాట్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా భంగపాటు తప్పలేదు. తెలంగాణ హైకోర్టు కూ డా వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాలని ఆ దేశించింది. ఇలాంటి విషయాల్లో తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. దీంతో అధికారుల కు న్యాయస్థానంలోనూ ఊరట లభించలేదు. అ న్ని మార్గాలు మూసుకుపోవడంతో విధిలేక కోర్టు ఆదేశాల మేరకు ఎక్కడి వారక్కడ రిపోర్టు చేయక తప్పలేదు. తమను రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఎఎస్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. డిఒపిటి కేటాయిం చిన రాష్ట్రాల్లో ముందు మీరు విధుల్లో చేరాలని అధికారులకు హైకోర్టు ఆదేశించింది. ఇలాంటి అంశాలపై స్టే ఇస్తూ వెళి తే కనుక ఎన్నటికీ తేలదని హైకోర్టు వ్యాఖ్యానించింది.
మీరంతా బాధ్యతాయుతమైన అధికారు లు ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉండవద్దని హితవు పలికింది. మీరు ఎక్కడ పని చేయాలో డిఒపిటి నిర్ణయిస్తుందని స్పష్టం చేసింది. అయితే రిలీవ్ చేసేందుకు పదిహేను రోజుల గడువును రెండు రాష్ట్రాలు డిఒపిటిని కోరాయని ఐఎస్‌ల తరపు న్యాయవాది కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. క్యాట్ తుది తీర్పు వచ్చే వరకు రిలీవ్ చేయవద్దని కోరారు. క్యాట్‌లో నవంబర్ 4న విచారణ ఉంద ని, కాబట్టి అప్పటి వరకు రిలీవ్ చేయవద్దని విజ్ఞ ప్తి చేశారు. ఉద్యోగులు ఎక్కడ పని చేయాలో కో ర్టులు నిర్ణయించవద్దని డిఒపిటి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ నర్సింహ శర్మ కోర్టుకు వెల్లడించారు. వారి పిటిషన్‌పై క్యాట్ స్టే ఇవ్వకపోవడం సరైన నిర్ణయమే అని పేర్కొన్నారు. డిఒపిటి నిర్ణయం సరైనదని చెప్పడానికి పూర్తి కారణాలను క్యాట్‌లో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం అధికారుల పిటిషన్లను కొట్టివేసింది.

**ఈనెల 9న ఆ ఐఏఎస్‌లకు డిఒపిటి ఉత్తర్వులు**

ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్ రాస్ లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎపికి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఎపిలో పనిచేస్తున్న సృజన, హరికిరణ్, శివశంకర్ తెలంగాణకు రావాల్సి ఉంది. ఈ మేరకు డిఒపిటి ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ప్రస్తుతం తాము పని చేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఈ నలుగురు ఐఎఎస్‌లు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)లో పిటిషన్ వేశారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని వెల్లడించారు. డిఒపిటి ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

**ఇదీ వివాదం**

ఉమ్మడి రాష్ట్రంలోని ఐఎఎస్, ఐపిఎస్‌లను 2014లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య విభజిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు రిలీజ్ చేసింది. అందులో ఐఎస్ అధికారులు సోమేశ్ కుమార్, వాణీ ప్రసాద్, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి, ప్రశాంతి ఐపిఎస్‌లు అంజనీ కుమార్, సం తోశ్ మెహ్రా, అభిలాష బిస్త్, అభిషేక్ మొహంతిని ఆంధ్రాకు కేటాయించారు. ఐఎస్ కేడర్‌కు చెందిన అధికారులు అనంతరాము, సృజన గుమ్మిళ్ల, ఎస్‌ఎస్ రావత్, ఎల్.శివశంకర్, సి.హరి కిరణ్, ఐపిఎస్ ఆఫీసర్ ఎవి రంగనాథ్‌ను తెలంగాణకు కేటాయించారు.

**ఐఎఎస్‌లకు రిలీవ్**

తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ స్థానంలో ప్రభుత్వం ఇన్‌చార్జీలను నియమించింది. పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసి కమిషనర్‌గా (ఎఫ్‌ఏసిగా) ఇలంబర్తి, ఆరోగ్యశ్రీ వెల్ఫేర్ ట్రస్ట్ సీఈఓగా (ఎఫ్‌ఏసిగా) ఆర్వీ కర్ణన్, ఆయుష్ డైరెక్టర్‌గా (ఎఫ్‌ఏసిగా) క్రిస్టినా, మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శిగా (ఎఫ్‌ఏసిగా) టికె శ్రీదేవీ, ఎనర్జీ సెక్రటరీగా (ఎఫ్‌ఏసిగా) సందీప్ కుమార్ సుల్తానియా, టూరిజం అండ్ కల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా (ఎఫ్‌ఏసిగా) శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

**సిఎస్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టు చేసిన ఎపి ఐఏఎస్‌లు**

సిఎస్ శాంతికుమారిని ఎపి ఐఏఎస్‌లు కలిశారు. డిఓపిటి ఆదేశాల మేరకు ఎపి నుంచి వచ్చిన ఐఏఎస్‌లు సృజన, శివశంకర్, హరికిరణ్ తెలంగాణ సిఎస్‌కు జాయినింగ్ రిపోర్టును అందజేశారు.
ఈ మెయిల్ ద్వారా ఎపి సిఎస్‌కు రిపోర్టు చేసిన తెలంగాణ ఐఏఎస్‌లుకాగా, డిఓపిటి ఉత్తర్వుల ప్రకారం తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలిలు ఈ మెయిల్ ద్వారా ఎపి సిఎస్‌కు రిపోర్టు చేశారు. అంతకుముందు క్యాట్ తీర్పును వ్యతిరేకిస్తూ తెలంగాణ హైకోర్టును ఐఏఎస్‌లు ఆశ్రయించినా వారికి ఊ రట దక్కలేదు. రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఏఎస్‌ల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ముందు ఎక్కడివాళ్లు అక్కడ రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఐఏఎస్‌లు సిఎస్‌లకు రిపోర్టు చేశారు.

# ఆరు పంటలకు మద్దతు ధర పెంపు

న్యూఢిల్లీ **ప్రజావినికిడి,:అక్టోబర్ 16:**
కేంద్ర ప్రభుత్వం గోధుమ పంటకు కనీస మద్దతు ధరను క్వింటాలు కు రూ. 150 చొప్పున పెంచింది. దీనితో ఇక గోధుమ మద్దతు ధర క్వింటాలుకు రూ 2425 కానుంది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థి క వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) సమావేశం జరిగింది. ఈ మంత్రివర్గ భేటీలో మద్దతు ధరల పెంపుదల నిర్ణయానికి ఆమోదం తెలిపారు. రెండు కీలక రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం ఈ మద్దతు ధర పెంపుదల నిర్ణయం తీసుకుంది. ఈ హెచ్చింపుతో గోధుమ పంట రైతులకు 202526 మా ర్కెటింగ్ సీజన్ నుంచి లాభం చేకూరుతుందని భేటీ తరువాత కేంద్ర సమాచార ప్రసారాల మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. గోధుమతో పాటు ఆరు రబీ పంటలకు కూ డా మద్దతు ధరలను పెంచారు. ఈ పెంపుదల రూ 130 నుం చి రూ 300 మధ్యలో ఉంటుంది.
ఇది కూడా పంటల విక్రయం ఆరంభమయ్యే ఏప్రిల్ 2025 నుంచి ఆ రంభం అయ్యే సీజన్ నుంచి చలామణిలోకి వస్తుందని మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలకు కట్టుబడి ఉం దని, ఖరీఫ్ పంటల మాదిరిగానే రబీ పంటలకు కూడా మద్దతు ధరల్లో గణనీయ పెరుగుదల కల్పించినట్లు అశ్విని వైష్ణవ్ చెప్పారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయం చాలా కీలకమైనది మంత్రి చెప్పారు. పంట సాగు వ్యయంతో పోలిస్తే గోధుమ పంటకు ఇచ్చే మద్దతు ధర 105 శాతం ఎక్కువ అని వివరించారు. దీని వల్ల రై తాంగానికి మేలు జరుగుతుందన్నారు. ఇక దేశంలో వంటనూనెల దిగుబడిని పెంచేందుకు, దిగుమతులను



తగ్గించేందుకు సం బంధిత గింజల మద్దతు ధరల ను పెంచింది. ఇందులో భాగంగా ఆవాలు, ఆముద గింజల మద్దతు ధరలను క్వింటాలుకు రూ 300 పెంచారు. దీనితో ఈ రెండింటి
ధర ఇకపై రూ 5950 అవుతుంది. ఇక కుసుమ గింజలకు రూ 140 చొప్పున పెంచారు. దీనితో ఇంతకు ముందటితో పోలిస్తే వీటి ధర ఇకపై రూ 5800 అవుతుంది. ఇక పప్పు ధాన్యాలలో పెసరకు క్వింటాలుకు రూ 275 పెంచారు. దీనితో దీని ధర ఇకపై క్వింటాలుకు 6700 వరకూ రైతులకు పలుకుతుంది. శెనగపప్పు ధరను రూ 210 పెంచగా , దీని ధర ఇక క్వింటాలుకు రూ 5650 మేర దక్కుతుంది. బార్లీకి క్వింటాలకు రూ 130 పెంచారుదీనితో ఇంతకు ముందు క్వింటాలుకు ఉన్న రూ 1850 ధర ఇకపై రూ 1980 అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర , జార?ండ్, ఢిల్లీల్లో ఎన్నికలకు ఇప్పటి ధరల హెచ్చింపునకు ఎటువంటి సంబంధం లేదని మంత్రి స్పష్టం చేశారు. దేశంలో ఆయా దినుసు నిల్వల పెంపు, ధరల తగ్గింపు క్రమంలోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సాధారణంగా ఇప్పుడు ఈ కనీస మద్దతు ధరల పెంపుదల సమయం అన్నారు. ప్రభుత్వం పట్ల రైతాంగంలో మంచి అభిప్రాయం వ్యక్తం అవుతోందని, వారి జీవన స్థితిగతుల్లో సరైన మార్పు తీసుకువచ్చే చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. ఇప్పుడు తీసుకున్న నిర్ణయాలతో దేశంలో పంటల వైవిధ్యత సాగు పెరుగుతుంది. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు ఆదాయం పెంచేందుకు పిఎం అన్నదాత ఆశా అభియాన్ పరిధిలో రూ 35 వేల కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఆమోద ముద్రవేసింది. ఇక రబీ పంట సీజన్‌కు యూరియాఏతర ఎరువులకు రూ 24,475 కోట్ల మేర సబ్సిడీకి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.


**వారణాసి డిడియు ట్రాక్ ప్రాజెక్టుకు పచ్చజెండా**

కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలకమైన వారణాసి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ (డిడియు) బహుళ స్థాయి రైల్వే ట్రాక్‌ల ప్రాజెక్టుకు కూడా ఆమోదం తెలిపారు. దీనికి రూ 2642 కోట్ల వ్యయ అంచనాలు వేశారు. ఇది అత్యంత కీలకమైన రైలు / రోడ్డు బ్రిడ్జిగా ఉంటుంది. . గంగా నది మీదుగా బ్రిడ్జి , దీనితో పాటు వారణాసి డిడియు జంక్షన్ వరకూ మూడో నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి వీలేర్పడుతుంది. ఇతరత్రా మౌలిక నిర్మాణాల అధునాతనన ప్రక్రియకు కూడా ఇది దోహదం చేస్తుందని మంత్రి చెప్పారు. వారణాసి రైల్వే స్టేషన్ భారతీయ రైల్వేలకు ప్రధాన కేంద్రంగా ఉందని, పలు కీలక జోన్లకు అనుసంధానంగా ఉండటం, ఇదే క్రమంలో యాత్రికులు, పర్యాటకులు, స్థానిక ప్రజలకు ముఖద్వారంగా ఉండటంవల్ల ఇక్కడ ట్రాక్‌లు ఇతరత్రా నిర్మాణాల అవసరం ఎంతైనా ఉందని వైష్ణవ్ తెలిపారు.

# ముదిరాజ్, గంగపుత్రులకు సర్కారు అన్యాయం

## : హరీశ్‌రావు

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
చెరువులు, ప్రాజెక్టుల్లో ఆగస్టులోనే వదలాల్సిన చేప పిల్లలను అక్టోబరు వచ్చినా వదలలేదని, అసలు ఇప్పటివరకు చేప పిల్లల కోసం టెండరే పిలవలేదని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు.ముదిరాజ్‌లకు, గంగపుత్రులకు కాంగ్రెస్ సర్కారు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... "చేప పిల్లల కోసం నాడు భారాస ప్రభుత్వం రూ.100 కోట్లు వెచ్చిస్తే... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.16 కోట్లే పెట్టింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక... బతుకమ్మ చీరలు బంద్ పెట్టారు. రైతుబంధుకు ఎగనామం పెట్టారు. కేసీఆర్ కిట్ ఆపేశారు. ఆర్ఆర్ఆర్‌ను మా హయాంలో ఉత్తర, దక్షిణ భాగాలుగా ప్రతిపాదించాం. 158 కి.మీ.ల ఉత్తరభాగానికి కేంద్రం ఆమోదించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా భూసేకరణ చేయడం లేదు. దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను పూర్తిగా మార్చారు. ఫలితంగా రూ.20 వేల కోట్ల ఖర్చు పెరుగుతోంది. దాన్ని ఎక్కడి నుంచి తెస్తారు?" అని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించేలా డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క ప్రకటన చేశారని, దీన్ని ఖండిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.



'అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నెల 15 వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.49,618 కోట్ల అప్పు తీసుకుందని భట్టి ప్రకటనలో పేర్కొన్నారు. కానీ అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం 2024 జులై 26 నాటికి మరో రూ.24,887.71 కోట్ల రుణాలకు హామీ ఇచ్చింది. టీజీక్యాబ్ రూ.5,000 కోట్ల రుణం పొందింది. కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో తీసుకున్న మొత్తం రుణం రూ.80,000 కోట్లుగా ఉంది' అని ఆయన ఆరోపించారు.

# తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. వీరిద్దరూ ఆయా పదవుల్లో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. కాగా, ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నారు.ఈ రెండు నియామకాలతో పాటు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు ఇంఛార్జి వీసీలను ప్రభుత్వం మార్చింది. కోఠి మహిళా యూనివర్సిటీ ఇంఛార్జి వీసీగా ధనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇంఛార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌ను నియమించారు. కాగా, సూర్య ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక

### డీఏను 3 శాతం పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**(మొదటి పేజి తరువాయి)**
ఇందులో గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.రైతులకు దీపావళి కానుకగా రావి పంటల ఎంఎస్‌పిని కూడా పెంచాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. నివేదిక ప్రకారం.. మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ప్రభుత్వం రబీ పంటలకు కొత్త కనీస మద్దతు ధర (%మీస్రా%)ని నిర్ణయించింది. ఇందులోభాగంగా గోధుమల ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.150 పెంచి రూ.2,425కి చేరుకుంది. ఇది ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.2,275గా ఉంది. ఆవాలపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెంచి క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.5,950కి పెరిగింది. అదేవిధంగా, కందుల ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.210 పెంచాలని నిర్ణయించారు. దాని కొత్త ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా మారింది. ఇది గతంలో క్వింటాల్‌కు రూ.5440గా ఉంది. ఇది కాకుండా కందులుపై ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.275 పెంచి క్వింటాల్‌కు రూ.6,425 నుంచి రూ.6,700కి పెంచారు. కుసుమ ధర రూ.5,800 నుంచి రూ.140 పెరిగి రూ.5,940కి చేరింది.రైతులకు వారి పంటలకు ప్రభుత్వం హామీ ఇచ్చే కనీస మద్దతు ధర ఎమ్ఎస్పీ అంటారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే ధర ఇది. పంటల ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల నష్టాల నుంచి రైతులను రక్షించడమే దీని లక్ష్యం. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ .. రైతుల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్నారు. పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉన్న రైతుల గురించి కూడా ప్రస్తావించారు. రైతుల సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉన్నామని, రైతులకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు

# జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం



శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్ తొలి ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నాయకుడు ఒమర్ అబ్దుల్లా(54) ప్రమాణం చేశారు.
బుధవారం శ్రీనగర్‌లోని షేర్-ఎ-కశ్మీర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు.. మరో ఐదుగురు మంత్రులతోనూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించారు. ఇందులో ఉపముఖ్యమంత్రి సురీందర్ చౌధరీ కూడా ఉన్నారు. ఎన్నికల్లో ఎన్‌సీతో కలిసి పోటీచేసిన కాంగ్రెస్.. ప్రభుత్వంలో చేరలేదు. ప్రస్తుతానికి బయటి నుంచే మద్దతివ్వాలని నిర్ణయించింది. జమ్మూకశ్మీర్ సీఎంగా పగ్గాలు చేపట్టడం అబ్దుల్లాకు ఇది రెండో సారి. జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో అధికరణం 370తో పాటు.. జమ్మూకశ్మీర్ రాష్ట్రహోదాను కేంద్రం రద్దు చేసిన సంగతి తెలిసిందే. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది. అబ్దుల్లా కుటుంబం నుంచి సీఎంగా పగ్గాలు చేపట్టిన మూడో వ్యక్తి ఒమర్ అబ్దుల్లా. తాత షేక్ అబ్దుల్లా, తండ్రి ఫరూక్ అబ్దుల్లా కూడా గతంలో సీఎంగా విధులు నిర్వహించారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధి, ఆప్ నేత సంజయ్ సింగ్, ఎన్‌సీపీ(ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే, సీపీఐ నేత డి.రాజా హాజరయ్యారు. అబ్దుల్లాను ప్రధాని మోదీ అభినందించారు. జమ్మూకశ్మీర్ ప్రగతి కోసం అబ్దుల్లాతోనూ.. అతని బృందంతోనూ కేంద్రం సన్నిహితంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

# కుల గణనను స్వాగతిస్తున్నాం: కోదండరాం

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**
కుల గణనను స్వాగతిస్తున్నట్లు తెజస అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం తెలిపారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.
కుల గణన ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, దాని ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు పచ్చజెండా ఊపి, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని భారాస నేతలు వ్యతిరేకించడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు చేస్తే బాగుంటుందన్నారు. మూసీ పునరుద్ధరణ అద్భుతమైన కార్యక్రమమని అన్నారు. నిపుణుల సలహాలు తీసుకుని ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్ స్వామి ఈ సందర్భంగా తెజసలో చేరారు.

# ఉగ్రవాదంపై పాకిస్థాన్‌కు జైశంకర్ చురకలు

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనేందుకు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పాకిస్థాన్ వెళ్లిన విషయం తెలిసిందే. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన ఇస్లామాబాద్‌లో జరుగుతున్న ఈ సదస్సులో భారత ప్రతినిధి బృందానికి జైశంకర్ సారథ్యం వహిస్తున్నారు. ఈ సమావేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదంపై ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి... పరోక్షంగా పాక్‌కు చురకలు అంటించారు. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదం, తీవ్రవాదం ఉంటే దేశాల మధ్య సహకారం వృద్ధి చెందే అవకాశం ఉండదని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. అలాగే ఇరు దేశాల మధ్య సహకారానికి పరస్పర గౌరవం, సార్వభౌమ సమానత్వం ప్రాతిపదికగా ఉండాలని తెలిపారు.
అందుకు నమ్మకం చాలా ముఖ్యమని అన్నారు. అందరూ కలిసి ఐక్యంగా ముందుకు సాగితేనే ఎస్‌సీఓ సభ్య దేశాలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి జైశంకర్ చెప్పారు.

## జర్నలిస్టులపై దాడుల నివారణకు
# కమిటీలను నియమించాలి..



ప్రజావినికిడి,(హైదరాబాద్):అక్టోబర్ 16:
జర్నలిస్టులపై దాడులను నివారణ కోసం జర్నలిస్టుల దాడుల నివారణ కమిటీలను ఏర్పాటు చేయాలని కొడుతూ తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్ డిపార్ట్ మెంట్ (ఐ అండ్ పిఆర్) కమీషనర్ హనుమంతరావును కలసి వినతి పత్రం సమర్పించారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా ఎన్ యుజె(ఐ) జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం, తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్,తోకల అనిల్ కుమార్,రాష్ట్ర నాయకులు చాప రవీందర్ లు ఈ సందర్భంగా మాట్లాడుతూ,దాడుల నివారణ కోసం రాష్ట్ర స్థాయితో పాటు అన్ని జిల్లాలలో కమిటీలను పునరుద్ధరించాలని కోరారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయంలో ప్రభుత్వమే స్వయంగా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.జర్నలిస్టుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులు 239ని తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు.అనేక సంవత్సరాలుగా చిన్న పత్రికలో ఎంప్యానల్ మెంట్ జరగకపోవడం వల్ల చిన్న పత్రికల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే చిన్న పత్రికలను ఎంప్యానల్ మెంట్ చేయాలని, అదేవిధంగా ఏబిసిడి వర్గీకరణను తొలగించాలని వారు కోరారు.చిన్న పత్రికలతో పాటు మీడియాకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికతో శ్వేత పత్రం విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని వారు కోరారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అభిషేక మహోత్సవాలకు
# మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం..



ప్రజావినికిడి,(హైదరాబాద్):
ప్రముఖ ఆధ్యాత్మీక గురువు శ్రీ రామదూత స్వామి ఆధ్వర్యంలో నవంబర్ 3వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అభిషేక మహోత్సవానికి రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి ప్రత్యేక ఆహ్వానంఅందించారు.రంగారెడ్డి జిల్లా, షాబాద్ మండలం, హైతాబాద్ లోని శ్రీ రామదూత స్వామి దివ్యధామం ప్రతినిధులు. అనంతరం వేదమంత్రోచ్ఛరణలతో స్వామిజీలు మంత్రిని ఆశీర్వదించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ అభిషేక మహోత్సవంలో వందలాది స్వామిజీలు పాల్గొని ప్రజా సంక్షేమం కోసం యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తారని వారు మంత్రికి వివరించారు. సమస్త లోక కళ్యాణం కోసం నిర్వహించే ఈ కార్యక్రమం ప్రతీయేటా నిర్వహిస్తున్నామని.. ఈ యేడాది నిర్వహించే అభిషేక మహోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తున్న దృష్ట్యా మంత్రిని ప్రత్యేకంగా ఆహ్వానించినట్టు మఠం ప్రతినిధులు తెలిపారు.ఆహ్వానం అందించిన వారిలో శ్రీ రాధాకృష్ణానంద దీక్షితులు,శ్రీ రమణానంద దీక్షితులు,శ్రీ పూర్ణానంద దీక్షితులు, శ్రీ విశ్వనాధ శర్మ లు ఉన్నారు.

# ఆర్య వైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం..

**అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్..**

**టిపిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త..**





ప్రజావినికిడి,(హైదరాబాద్):
ఆర్యవైశ్యులఅభివృద్ధికి కృషి చేస్తాం అని ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ అలాగే రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైటెక్ సిటీ హోటల్ ఐ స్టే లో జరిగింది.ఉప్పల శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలోఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ,దేశ వ్యాప్తంగా వున్న ఆర్య వైశ్యులను ఏకం చేయడమే అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. తెలంగాణ లో ఐవిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త కు ఆయన అభినందించారు. అనంతరం గంజి రాజమౌళి గుప్త మాట్లాడుతూ,ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన అన్నారు.అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అలాగే రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ,దేశ వ్యాప్తంగా వ్యాపార రంగంలో రాణించాలని ఆయన అన్నారు అందుకు అన్ని విధాలా కృషి చేస్తాము అని ఆయన అన్నారు. ఎన్నో యేండ్ల కల ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలా ఆర్య వైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఆయన అన్నారు.రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో మాట్లాడి ఆర్య వైశ్యులకు పదవులు దక్కితే కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐవి ఎఫ్ రాష్ట్ర నాయకులు ముత్యాల సత్తయ్య, సంతోష్ గుప్త,బిజ్జల నవీన్ గుప్త,గట్టు మహేష్ గుప్త,సంబు పాండు గుప్త,కటకం శ్రీనివాస్ గుప్త,చింతల రజినీకాంత్ గుప్త, కొడిపాక నారాయణ, నరేష్ గుప్త,బెల్దే రవి కుమార్ గుప్తా,గట్టు మహేష్ గుప్త,ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కుల గణనను స్వాగతిస్తున్నాం: కోదండరాం

%హైదరాబాద్,కుల గణనను స్వాగతిస్తున్నట్లు తెజస అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం తెలిపారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.కుల గణన ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, దాని ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు పచ్చజెండా ఊపి, ప్రతిపక్షంలోకి రాగానే వాటిని భారాస నేతలు వ్యతిరేకించడం సరికాదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు చేస్తే బాగుంటుందన్నారు. మూసీ పునరుద్ధరణ అద్భుతమైన కార్యక్రమమని అన్నారు. నిపుణుల సలహాలు తీసుకుని ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిలగాని సంపత్‌కుమార్ స్వామి ఈ సందర్భంగా తెజసలో చేరారు.

# తీగల చిత్రలేఖకు పుట్టిన రోజు శుభాకాంక్షలు..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న తీగల చిత్రలేఖకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.నీవు ఎల్లప్పుడూ,నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాము. అలాగే భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థానానికి ఎదుగుతూ గురువులు, తల్లిదండ్రుల పేరు ప్రతిష్టలను నిలబెట్టాలని కోరుకుంటున్నాము.
తల్లిదండ్రులు: తీగల మేఘన-శ్రీనివాస్ అక్క: తీగల వర్ష దిల్ సుఖ్ నగర్, హైదరాబాద్..

# ఏడు బిందెలతో పాలాభిషేకం..



ప్రజావినికిడి,(అంబర్ పేట్):
హైదరాబాద్ అంబర్ పేట్ అలీకేఫ్ చౌరస్తా వద్దనున్న మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహానికి ఏడు బిందెలతో పాలభిషేకాన్ని మాజీ పార్లమెంట్ సభ్యులు వి.హనుమంత్ రావు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర క్యాబినెట్లో 7 నెలల తర్వాత బీసీ కుల గణనను నిర్ణయించడంపై విహెచ్ హర్షం వ్యక్తం చేశారు.కేంద్రంలో నరేంద్ర మోడీ బిసి వాదినని చెప్పడమే తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.జీవో నంబర్ 18 విడుదలపై రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కులగనను చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలోని ప్రతిపక్షాలు దీనిపై నోరు మెదకపోవడంపై కారణమేమిటని ప్రశ్నించారు.కుల గణన ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారందరికీ సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే బిసి కులగననకు ప్రతి ఒక్కరూ సహకరించాలని హనుంత్ రావ్ కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ, బాల్‌రాజ్ గౌడ్,ఆర్ లక్ష్మణ్ యాదవ్,శంభుల శ్రీకాంత్ గౌడ్,మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, గరిగంటి రమేష్,దిండి రాంబాబు,పులి జగన్, అప్సర్,యూసుఫ్, రామ్మోహన్ రావు, గడ్డం శ్రీధర్ గౌడ్,కోటం అనిల్,తలుపునూరి కృష్ణ గౌడ్,షేక్ జమీర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణను అడ్డుకుంటే
# సహించేది లేదు.



ప్రజావినికిడి,(అబర్ పేట్):
బీసీ కులగణను అడ్డుకుంటే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,బాల్ రాజ్ గౌడ్ తేల్చి చెప్పారు.హైదరాబాద్ అంబర్ పేట్ అలీకేఫ్ చౌరస్తా వద్దనున్న మహాత్మ జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ, కేంద్ర క్యాబినెట్లో 7 నెలల తర్వాత బీసీ కుల గణనను నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు.జీవో నంబర్ 18 విడుదలపై రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కులగణను చేపట్టాలని ఆదేశాలు ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలోని ప్రతిపక్షాలు దీనిపై నోరు మెదకపోవడంపై కారణమేమిటని ప్రశ్నించారు.కుల గణన ద్వారా బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాల వారందరికీ సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు.కొన్ని రాజకీయ పార్టీలు బీసీ కులగణను అడ్డుకోవాలని కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేటీఆర్,సిపిఎం, సిపిఐలు బీసీ కుల గణనపై ఎందుకు నోరు మోపడంలేదని సూటిగా ప్రశ్నించారు. ఎవరైనా కులగణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఎమ్మెల్యే, ఎంపీ, చివరికి మంత్రుల ఇండ్లని చూడకుంటా ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కులకచర్ల శ్రీనివాస్, బాల్‌రాజ్ గౌడ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్,గరిగంటి రమేష్, దిండి రాంబాబు,పులి జగన్,బీసీ సంఘం నాయకులు,నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్న కాంగ్రెస్ సర్కారు..




ప్రజావినికిడి, (ముషిరాబాద్):
మూసి సుందరీకరణ పేరుతో పేద ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నారని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన "మూసి సుందరీ కరణ ఎవరికోసం" అనే పేరుతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మూసీ సుందరీకరుణ బడా బాబులకు కాంట్రాక్టులు ఇవ్వడమే తప్ప మూసిని సుందరీకరణ చేయడం జరుగదన్నారు. ముందుగా మూసి ప్రక్షాళనను చేయాలని హితవు పలికారు. ఛాదర్ ఘాట్ శివాజీ బ్రిడ్జి నివాసితులకు అధికారులు ఓట్లు వేయించుకోవడమే తప్ప వారికి ఆధార్, ఓటరు కార్డు లేదనే సాకుతో డబుల్ బెడ్ రూమ్ లను ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కొంతమంది నిరుపేదలకు ఓటర్ కార్డు,ఆధార్ కార్డు కూడా లేదని లేనివారికి డబుల్ బెడ్ రూమ్ లపై అధికారులు విముఖత చూపిస్తున్నారని వాపోయారు.ఇక్కడ నివసించే 150 కుటుంబాల వారికి జీవనోపాధి కల్పించి వారి పిల్లలకు విద్య, ఉద్యోగ,అవకాశాలు కల్పించాలని అలాగే ప్రతి ఒక్కరికి జీవనోపాధి మార్గాన్ని చూపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద ప్రజలకు మార్గం చూపకుండా కూల్చివేతలు నిర్వహిస్తే ఎంతటి ఆందోళనకైనా దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రోడ్డుపై చెత్త వేస్తే

## వెయ్యి రూపాయల జరిమానా వేయాలి..

### కార్పొరేటర్ పవన్ కుమార్..



ప్రజావినికిడి,(కొత్తపేట):బుధవారం రోజు కొత్తపేట డివిజన్ మారుతి నగర్,ప్రభాత్ నగర్ కాలనీ ప్రధాన రోడ్డులో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ కాలనీలకు వెళ్ళే ప్రధాన రోడ్డు మార్గంలో చెత్త డంపింగ్ వుండటం చుట్టూ పక్కల ఉన్న కాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ పవన్ కుమార్ కు తెలియజేయడంతో వెంటనే వారు అక్కడికి వెళ్లి సమస్యను పరిశీలించారు. సంభందిత సానిటైజేషన్ డీఈ చందనని పిలిపించి రోడ్డు పై చెత్తను డంపింగ్ చేయకుండా వుండేలా తగిన చర్యలు తీసుకోవాలని,ఎవ్వరు చెత్త రోడ్డుపై వేయకుండా వుండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చెత్త వేస్తే వారికి వేయి రూపాయల జరిమానా విదించేలా చేయాలని కోరారు.అనంతరం వెంటనే బాప్ కార్డ్ తో చెత్తను అలాగే మట్టికుప్పలను తీయించి శుభ్రం చేయించారు. అనంతరం కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండ డంపింగ్ పాయింట్ తీయించేలా చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు కార్పొరేటర్ తెలియజేశారు.ఈ పర్యవేక్షణలో కాలనీ వాసులు మల్లేష్, సరోజినీ,జిహెచ్ఎంసి అధికారులు బుచ్చయ్య,ప్రేమ్, విజయ భారతి, తదితరులు ఉన్నారు.

# 20 న మున్నూరు కాపు కార్యవర్గ సమావేశం...

## అనుబంధ సంస్థల పాలకవర్గం ఏర్పాటు...

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**



మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఈ నెల 20 న ఆదివారం ఉదయం 11 గంటలకు మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంబర్కతుపుర టిఎంకేజేఏసీ రాష్ట్ర కార్యాలయంలో జరగనున్నది.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ కార్యవర్గం,33 జిల్లాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు అలాగే నాలుగు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కమిటీ సూచించింది. మహిళా రైతు, యూత్,సీనియర్ సిటిజన్స్,లీగల్ సెల్ కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కన్వీనర్ ఆర్.వి మహేందర్ తెలిపారు. కావున 33 జిల్లాల అధ్యక్షులు,మహిళ, రైతు,యూత్, సీనియర్స్ సిటీజేన్స్, లీగల్ సెల్ కమిటీ సభ్యులను అన్ని జిల్లాల అధ్యక్షులు ఐదుగురు సభ్యుల చొప్పున తీసుకొని రావాలని కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ ఆధ్వర్యంలో అనుబంధ స్టేట్ కమిటీలు ఏర్పాటు చేయనున్నామని ఆర్వి మహేందర్ తెలిపారు. అన్ని జిల్లాల అధ్యక్షులు,రాష్ట్ర కమిటీ సభ్యులందరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆర్వి మహేందర్ పటేల్ విజ్ఞప్తి చేశారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఫండ్ మూడు వేల కోట్లు, ప్రతి జిల్లా కేంద్రంలో 2 ఎకరాల భూమి, హాస్టల్ భవన నిర్మాణం కొరకు 5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాలని తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.కోకాపేట ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరు టవర్ల నిర్మాణం చేయాలన్నదే సమావేశం ప్రధాన ఉద్దేశమని ఉద్దేశ్యమని మహేందర్ తెలిపారు. రాబోయే కాలంలో స్థానిక ఎన్నికలలో మన వాటా గురించి ఈ కార్యక్రమంలో చర్చించనున్నట్లు తెలిపారు.మున్నూరు కాపుల అభివృద్ధి కొరకు కొన్ని ముఖ్య తీర్మానాలు చేయనున్నామని, త్వరలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ప్రజా గర్జన గురించి చర్చ కార్యక్రమము ఉంటుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యవర్గ సమావేశంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ పటేల్,రాష్ట్ర ఉపాధ్యక్షులు జేవిఆర్,గ్రేటర్ హైదరాబాద్ సిటీ ప్రెసిడెంట్ ఆర్ వి.మహేందర్ కుమార్ పటేల్, స్టేట్ లీగల్ సెల్ కమిటీ చైర్మన్ వొంటేల రత్నాకర్ పటేల్, హైకోర్ట్ సీనియర్ న్యాయవాది రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ తాడెం రంజిత కృష్ణమూర్తి పటేల్,స్టేట్ మహిళా కన్వీనర్ బోనాల శ్వేత పటేల్, స్టేట్ మహిళా కో-కన్వీనర్ మెతుకు హేమలత పటేల్ తదితరులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

# గౌరెల్లి గ్రామ లో సీఎం రిలీఫ్ పాండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు..



ప్రజావినికిడి,(అబ్దుల్లాపూర్మెట్): మండలంగౌరెల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఐదుగురికి లబ్ధిదారులకు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి గ్యార భగవాన్ దాస్ గౌరెల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గ్రామ శాఖ అధ్యక్షులు చేచల నాగరాజు,మాజీ సర్పంచ్ చేటిగారి ఆంజనేయులు,కూర బిక్షపతి,కొమ్ము గీత, మోర వెంకటేష్,లెక్కల ప్రమీలమ్మ,కె అమర్నాథ్,చేచల అశోక్ బి బ్లాక్ అధ్యక్షులు,లెక్కల అనీష్ రెడ్డి,కుంట దర్శన్.కొమ్ము బాల నరసింహ ఈ కార్యక్రమంలో తదిరులు పాల్గొన్నారు.

# నందిగామ గ్రామంలో గ్రామదేవతల విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం..

### పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..



ప్రజావినికిడి,(నందిగామ):
నందిగామ గ్రామంలో గ్రామదేవతల విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ ఈట గణేష్,కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి,చేగుర్ పిఎసిఎస్ చైర్మన్ అశోక్,చేగుర్ మాజీ పిఎసిఎస్ చైర్మన్ విట్టల్,నందిగామ పిఎసిఎస్ వైస్ చైర్మన్ రజినీకాంత్,బండన్ గూడ సర్పంచ్ రాజు,సింగల్ విండో డైరెక్టర్స్,మాజీ వార్డ్ మెంబెర్స్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం..

### వాసన్ ఐ కేర్ ఆసుపత్రి,దిల్సుక్ నగర్ వారి సౌజన్యంతో




ప్రజావినికిడి,(దిల్ సూక్ నగర్):
శ్రీషిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ దిల్ సుక్ నగర్,హైదరాబాద్, తెలంగాణ.(ఉచిత వైద్య సేవా కేంద్రం ) తేదీ . 20.10.2024 ఆదివారము సమయము : ఉ.9.00 గం.ల నుండి సా.4.00 గం.ల వరకు..ప్రముఖ కంటి వైద్య నిపుణులచఉచితముగా కంటి పరీక్షలనిర్వహించబడును. అవసరమైన వృద్దులకు కంటి అద్దములు ఉచితముగా ఇవ్వబడును.అవసరమైన వారికి ఉచితముగా ఐ డ్రాప్స్ అలాగే మందులు ఇవ్వబడును సాయి భక్తులందరూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరం యొక్క సేవలను వినియోగించు కోవలసినదిగా కోరుచున్నారు.

# తెలంగాణ భవన్ లో మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



ప్రజావినికిడి,(హైదరాబాద్):
బుధవారం రోజు తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు అలాగే ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మ్యూజికల్ నైట్ కోసం దేవి శ్రీ ప్రసాద్ ఆహ్వానం..

### నిర్మాత బండ్ల గణేష్ తో కలిసి ఆహ్వానించిన దేవిశ్రీప్రసాద్..



ప్రజావినికిడి,జూబ్లీహిల్స్):
జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మర్యాదపూర్వకంగా కలిసిన సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్.ఈ నెల 19న జరిగే మ్యూజికల్ కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎంలను ఆహ్వానించిన దేవిశ్రీప్రసాద్ ఆయనతో పాటు ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేష్ కూడా ఉన్నారు.

# ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను కలిసిన కాంగ్రెస్ నేతలు మామిడి నర్సింగ్ రావు కాటూరి రమేష్...



(ఖైరతాబాద్):అక్టోబర్ 16 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే మాజీ మంత్రి దానం నాగేందర్ ని జూబ్లీహిల్స్ డివిజన్ కు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు కలిసి దసరా సందర్భంగా కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్,18 బస్తిల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగ్ రావు, సీనియర్ నాయకులు ఆకుల రాజు,భవాని రమేష్,విజయరావు తదితరులు పాల్గొన్నారు.

# దీప దాస్ మున్షి ని కలిసిన నారికేల నరేష్...



ప్రజావినికిడి,(ఖైరతాబాద్):అక్టోబర్ 16:
ఏఐసీసీ జాతీయ ప్రధానకార్యదర్శి,టిపిసిసి ఇంచార్జ్ దీపా దాస్ మున్షి ని ఖైరతాబాద్ నియోజకవర్గ సోమాజిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారికేల నరేష్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శాలువా కప్పి,బొకే ఇచ్చి దీపా దాస్ మున్సిని ఘనంగా సత్కరించారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# తీర్పు ప్రకారమే గ్రూప్ 1 నియామకాలు

**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16:**

గ్రూప్ 1 నియామకాలు తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టంచేసింది.గ్రూప్-1 పరీక్షల నిలిపివేతకు నిరాకరించింది. ఈ నెల 21 నుంచి పరీక్షలు జరగున్నాయని, ఈ పరిస్థితుల్లో ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయబోమని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వం, టీజీపీఎస్సీలకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను నవంబర్ 20కి వాయిదా వేసింది.
ది వ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022 నాటి జీవో 55కు సవరణ తీసుకువస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 8న జీవో 29 జారీచేయడాన్ని సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావులతో కూడిన ద్విసభ్య ధ ర్మాసనం బుధవారం విచారణ జరిపింది.పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపి స్తూ జనరల్ క్యాటగిరీలోని అభ్యర్థులకంటే ఎకువ మారులు సాధించినవారిని అన్ రిజర్వుడుగా పరిగణించడం వల్ల దివ్యాంగులకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. వారికంటే ఎకువ మారులు వచ్చినప్పటికీ రిజర్వేషన్ క్యాటగిరీ కిందనే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్‌కు పిలవాలని కోరారు. జీవో 55ను సవాల్ చేసిన వ్యాజ్యాలు విచారణలోనే ఉన్నాయని, దానికి సవరణ జీవో తేవడం చెల్లదని తెలిపారు.దీనికితోడు రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా 62 శాతానికి చేరడం చట్ట వ్యతిరేకమని అన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, అవి కార్యనిర్వాహక ఉత్తర్వులు మాత్రమేనని చెప్పారు. దివ్యాంగుల చట్టంలోని సెక్షన్ 34 ప్రకారం నిబంధనలు తీసుకువచ్చామని, జీవో రాజ్యాంగ విరుద్ధం కాదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు స్టే ఇచ్చేందుకు, పరీక్షలను వాయిదా వేసేందుకు నిరాకరించింది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ప్రాణం తీసిన అతివేగం

- అదుపు తప్పి వాగులో పడిన కారు.... ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు దుర్మరణం
- శుభకార్యానికి వెళ్లి వస్తుండగా మెదక్ జిల్లాలో ఘటన
- అతివేగమే ప్రమాదానికి కారణం : డీఎస్పి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి



శివ్వంపేట**ప్రజావినికిడి,అక్టోబర్ 16**: అతివేగంగా కారు దూసుకొచ్చిన కారు వాగులో పడిపోయిన ఘటనలో ఏడుగురు వ్య క్తులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా, శివ్వంపేట మండలం లో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘోర ప్రమాదం పై స్థానికు లు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం%ొ%. శివ్వంపేట మండలంలోని శంకర్‌తండా, సీతారాం తండా, తాళ్లపల్లి తండాకు చెం దిన వారు బుధవారం వర్గల్ మండలం, సీతారాం తండాలోని త మ బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి చేరుకు నే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం సాయంత్రం త మ స్వగ్రామానికి సమీపంలో గల ఉసిరికపల్లి పరిధిలోని వారు ప్ర యాణిస్తున్న కారు అతివేగంగా వచ్చి అదుపుతప్పి వాగులో పడిపోయింది. అక్కడే పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొనడంతో కారులో డ్రైవర్ మినహా మిగతా వారంతా అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వాగులో పడిపోయి నుజ్జునుజ్జయిన కారును జెసిబి సహాయంతో వెలికితీశారు. కారులో ఉన్న మృతదేహాలను బయటకు తీయగా దనావత్ శివరాం (55), దనవాత్ దుర్గమ్మ (45), మాలోత్ అనిత (30), మాలోత్ బిందు (14), మాలోత్ శ్రావణి (12), గూగులోత్ శాంతి (45) గూగులోత్ మమత (16)ను మృతులుగా పోలీసులు గుర్తించారు. మృతులంతా గిరిజనులే కావడంతో ఆయా తండాల గిరిజనులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన కారు డ్రైవర్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి తూప్రాన్ డిఎస్‌పి వెంకటరెడ్డి, శివ్వంపేట ఎస్‌ఐ మైపాల్ చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమని డిఎస్‌పి వెంకట్‌రెడ్డి అన్నారు.

# దీపావళికి ముందే మిగిలిన వారికి రుణమాఫీ

**రైతులకు అనుకూలంగా ప్రభుత్వం**

**అనేక నిర్ణయాలు తీసుకున్నామన్న కోమటిరెడ్డి**

**పంటరుణం రూ.2 లక్షల కన్నా పైనున్న వారికి విడతల వారీగా డబ్బులు జమ**

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**



నల్లగొండ**ప్రజావినికిడి, అక్టోబర్ 16** :రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సపంలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని, రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు.ఎస్ఎల్‌బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు జరుగుతుందని, సుమారు 50,000 ఎకరాలలో బత్తాయి సాగు చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భాగంగా నల్గొండ జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటి వరకే 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిం చామన్నారు. ఈ వారం చివరి వరకు అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు,తూకం యంత్రాలు, లారీలు, హమాలీల వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర రైతులకు వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రెండు శుభవార్త లు చెప్పారు. నిడమానూర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ గురించి ప్రస్తావించారు. దీపావళి పండుగ కంటే ముందే మిగిలిన 4లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. త్వరలో రైతు భరోసా కూడా అందిస్తామని అన్నారు. పంటరుణం రూ.2 లక్షల కన్నా పైనున్న వారికి విడతల వారీగా డబ్బులు జమ చేస్తామని చెప్పారు.రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని.. రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని మంత్రి వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనుగుణమైన పరిపాలన అందిస్తున్నామని.. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు చిన్నాభిన్నమైయ్యాని మంత్రి తుమ్మల అన్నారు. నల్గొండ జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసి తీరుతామని తెలిపారు. కుందురు జానారెడ్డి1982 నుంచి రాజకీయాల్లో తన చేయి పట్టుకొని నడిపించారని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. తన రాజకీయ గురువు జానారెడ్డే అని ఆయన చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లోతనను నిలబెట్టింది జానారెడ్డి అని చెప్పుకొచ్చారు.12 శాఖల మంత్రిగా పని చేసిన జానా రెడ్డి తన్ను ప్రోత్సహించారని అన్నారు. జానారెడ్డి రాజకీయం అంటే నీతి నిజాయితీ నిబద్ధతతో ఉంటాయని మంత్రి తుమ్మల చెప్పారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు

**- పెద్దవాగుపై వంతెన వీలైనంత త్వరలో పూర్తి చేస్తాం**

**- రోడ్డు సౌకర్యం లేనిచోట రోడ్డు నిర్మాణాలు చేపడతాం**

**- వాగు నీటిలో నడుచుకుంటూ వెళ్లిన మంత్రి**

**- మంత్రిని అనుసరిస్తూ వాగులో నడిచిన నాయకులు**

**- రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు ఘనస్వాగతం**







వరంగల్**ప్రజావినికిడి, ):అక్టోబర్ 16**: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పునరుద్ఘాటించారు.జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జిల్లా కేంద్రంలోని అటవీశాఖ గెస్ట్ హౌస్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం గుండి గ్రామంలో పదో తరగతి వరకు ఉన్నతీకరించిన పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాల ఉన్నతీకరణతో గ్రామీణ ప్రాంతంలో విద్య అభివృద్ధి చెందుతుందన్నారు. గుండి గ్రామానికి మధ్యలో అడ్డుగా ఉన్న పెద్దవాగుపై వంతెన సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. గుండి గ్రామం నుండి కనరగాం రహదారి కూడా పూర్తి చేస్తామన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు లేని చోట అవసరమైన రహదారులు నిర్మిస్తామన్నారు. ఇదే సందర్భంలో గ్రామ మాజీ సర్పంచ్ పెండింగ్ బిల్లుల కోసం అడగగా మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం తిరిగి వెళ్ళేటప్పుడు వాగులో నడుచుకుంటూ రావడంతో నాయకులు ఆమెను అనుసరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు విశ్వప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిల్డర్లను బెదిరించేందుకే హైడ్రా

## కేటీఆర్ ఆరోపణ



**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16**: ఎద్దపెద్ద బిల్డర్లను బెదిరించేందుకే హైడ్రాను ఉపయోగిస్తున్నట్లు తాము నమ్ముతున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా, మూసీ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం భయానక వాతావరణం సృష్టించిందని, దీని నుంచి ప్రజల్ని రక్షించేందుకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బుధవారం నిర్వహించిన మూసీ ప్రాజెక్టు సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 50 ఏళ్ల కిందట పట్టాలు పొంది నిర్మించుకున్న వారి ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తామంటే కుదరదన్నారు. 'మీరు (కాంగ్రెస్ పార్టీ) చేసిన తప్పులకు పేదలను బలి చేస్తారా.. మీరే పట్టాలిచ్చి మీరే కూలగొడతారా' అంటూ నిలదీశారు. భారాస చూస్తూ ఊరుకోదని, పేదలకు రక్షణ కవచంగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులుంటే తమ ప్రజాప్రతినిధులను కలవాలని, లేదా తెలంగాణ భవన్‌కు రావాలని సూచించారు. తమ ఫాంహౌస్‌లు చట్టవిరుద్ధంగా ఉంటే పడగొట్టవచ్చని అన్నారు. "ఈ ప్రభుత్వ పాలనతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయింది.ప్రధాని మోదీ పెద్ద నోట్లు రద్దు చేసినప్పుడు ఎలాంటి కారణాలు మార్చి మార్చి చెప్పారో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే పద్ధతి అవలంబిస్తోంది. ఒకరోజు మూసీ సుందరీకరణ అంటారు.. మరోరోజు నల్గొండకు నీళ్లంటారు. ఒకసారి డీపీఆర్ లేనే లేదంటారు. మూసీకి సంబంధించి 100 శాతం మురుగునీటి శుద్ధి ప్లాంట్లను మా హయాంలో రూ.4 వేల కోట్లతో నిర్మించాం. గరీబోళ్లకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వద్దని కేసీఆర్ ఏనాడో చెప్పారు. మా ప్రభుత్వం చేపట్టిన నాలా అభివృద్ధి కార్యక్రమం ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. తమకు అప్పులు పుట్టడం లేదని మంత్రి తుమ్మల అంటున్నారు. మీ సీఎం తీరుతో అప్పులెలా పుడతాయి? ప్రభుత్వం 10 నెలల్లో రూ.80 వేల కోట్ల అప్పు చేసినా.. ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదు. మరి ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది? ప్రధాని మోదీని ఒక్కమాట అనే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదు. కేబీఆర్ పార్కు వద్ద పై వంతెన కట్టాలని మేం అనుకున్నా.. పర్యావరణం దెబ్బ తింటుందని విరమించుకున్నాం. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2 వేల కోట్లు చెల్లించాం' అని కేటీఆర్ వివరించారు.

# సొమ్ములు కేంద్రానివి..సోకులు రాష్ట్ర ప్రభుత్వానివి

## :ఈటల రాజేందర్



**ప్రజావినికిడి, (హైదరాబాద్):అక్టోబర్ 16**: కేంద్ర ప్రభుత్వం అనేక రూపాల్లో రాష్ట్రానికి నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సోకులు చేస్తోందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్రం నిధులు ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం వద్ద అదనంగా ఒక్క రూపాయి ఖర్చు చేసే స్థోమత లేదని విమర్శించారు. ఈ విషయం అంగీకరించకుండా కాంగ్రెస్ నేతలు బీజేపీ ఎంపీలపై ఆడిపోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణకు అన్ని విధాలుగా సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, కాంగ్రెస్ ప్రభుత్వం వాలకం చూస్తే బాధగా ఉందని అన్నారు. కేంద్రం నిధులు ఇవ్వడం లేదని దుమ్మెత్తిపోస్తున్నారని, ఇంతకీ వీళ్లకు అవగాహన ఉందా లేదా అని ప్రశ్నించారు.

నేనూ ఆర్థిక మంత్రిగా పని చేశానని, కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ కూడా ఓ రాష్ట్రానికి ప్రాధాన్యత మరో రాష్ట్రానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వదని అన్నారు. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, నితిన్ గడ్కరీతో భేటీ అయిన వివరాలను ఆయన వెల్లడిస్తూ ఎఫ్ఆర్‌బీఎం రుణాలు 50 శాతం దాటాయని అన్నారు. సీఎస్ఎస్ పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 40 శాతం నిధులు జమ చేయకపోవడం వల్లే కేంద్రం నుంచి వచ్చే నిధులు సకాలంలో రావడం లేదని తెలిపారు. అంతే తప్ప బట్టకాల్చి మీద వేయడం సరికాదని చెప్పారు.

రాష్ట్రంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నాయని, వాటన్నింటిని ఒక్కటి చేయడం తప్పా రేవంత్ రెడ్డి సర్కార్ కొత్తగా చేస్తున్నదేమి లేదని ఈటల రాజేందర్ అన్నారు. ఉన్న స్కూళ్లను మూసి వేయకుండా కొత్త భవనాలు, సరిపడా సిబ్బందిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కెసిఆర్ ఆర్భాటం చేసి ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ స్కూళ్లకు డైట్ చార్జీలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని విమర్శించారు.

ఇకనైనా రేవంత్ రెడ్డి డాంబికాలు మాట్లాడకుండా నేలమీదకు దిగి వచ్చి పేద పిల్లలు చదువుకునే హాస్టల్స్‌కు అద్దెలు, డైట్ చార్జీలు చెల్లించాలని సూచించారు. సంవత్సరాల పాటు అద్దెలు చెల్లించకుండా హాస్టల్ బిల్డింగ్‌లకు యజమానులు తాళాలు వేస్తే క్రిమినల్ కేసులు వేస్తామంటే ఇంతకంటే వెర్రితనం మరొకటి ఉండదా? అని ఈటల ప్రశ్నించారు. దబాయింపులతో ప్రభుత్వాన్ని ఎప్పుడు నడపలేరన్నారు. ప్రభుత్వం డొల్లతనం అందరికి తెలిసిపోయిందని, మంత్రులు కోపానికి రావొద్దని హితవు పలికారు. గత ప్రభుత్వం కూడా ఇలాగే బెదిరిస్తే వారికి ఏం గతి పట్టిందో అందరం చూశామని అన్నారు. వారిని చూసి కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకోకపోతే ఇక వారి ఖర్మ అన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అయిందని కానీ ఇప్పటి వరకు ఎక్కడా కూడా కొత్త కేటాయింపులు లేవని తెలిపారు.



# నారా బ్రాహ్మణి క్లాప్‌తో బాలకృష్ణ 'అఖండ-2: తాండవం' ప్రారంభం

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వచ్చిన ఇప్పటి వరకు వచ్చిన సింహా, లెజెండ్, అఖండ చిత్రాలు భారీ విజయాలను అందుకున్నాయి. తాజాగా ఈ ఎవర్‌గ్రీన్ కలయికలో రూపొందుతున్న నాలుగో చిత్రం 'అఖండ-2: తాండవం' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అఖండ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కనున్న చిత్రమిది. ఈ చిత్రం పూజా కార్యక్రమాల్లో చిత్ర యూనిట్‌తో పాటు బాలకృష్ణ కుమార్తెలు నారా బ్రాహ్మణి, తేజస్విని ఇతర ఫ్యామిలీ మెంబర్స్ కూడా పాల్గొన్నారు. బాలకృష్ణపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నారా బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. తమన్ స్వరాలు అందిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలుస్తాయి.




# హీరోగా ఎంట్రీకి రెడీ అవుతున్న స్టార్ డెరెక్టర్ కొడుకు!





తెలుగు సినీ పరిశ్రమ అనే కాదు దాదాపు అన్ని సినీ పరిశ్రమలలో వారసులు ఎంట్రీ ఇవ్వడం అనేది సర్వసాధారణం. హీరోల వారసులతోపాటు హీరోయిన్ల వారసులు అలాగే దర్శకులు, నిర్మాతల వారసులు కూడా నటులుగా ఇతర టెక్నీషియన్లుగా ఎంట్రీ ఇచ్చి తమ సత్తా చాటుకునే ప్రయత్నం చేసి సక్సెస్ అయిన వాళ్ళు ఉన్నారు. ఇంకా తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేసే వాళ్ళు కూడా ఉన్నారు. ఇప్పుడు మరో దర్శకుడు కుమారుడు హీరోగా మారేందుకు రంగం సిద్ధమైంది. ఆ దర్శకుడు మరెవరో కాదు ఎన్నో యూత్ ఫుల్ సినిమాలు డైరెక్ట్ చేసి ప్రస్తుతానికి సరైన హిట్టు కోసం ఎదురు చూస్తున్న దర్శకుడు తేజ. దర్శకుడు తేజ తన కొడుకు అమితోవ్ తేజను హీరోగా పరిచయం చేయడానికి రెడీ అవుతున్నారు. ప్రస్తుతానికి ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. నవంబర్ లేదా డిసెంబర్ నుండి షూట్ కి వెళ్లొచ్చు అనేది ఇండస్ట్రీ వర్గాల సమాచారం. దర్శకుడు తేజ గతంలో ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేశారు. చివరిగా నేనే రాజు నేనే మంత్రి అనే సినిమాతో హిట్ అందుకున్న ఆయన దగ్గుబాటి సురేష్ బాబు కుమారుడు దగ్గుబాటి అభిరామ్ హీరోగా అహింస అనే సినిమా చేశాడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద మాత్రమే కాదు విమర్శకుల దగ్గర కూడా దారుణమైన విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే తేజ కుమారుడి సినిమాకి తేజనే దర్శకత్వం వహించబోతున్నారు అని తెలుస్తోంది. అయితే నిర్మాత ఎవరు? అనే విషయం మీద ప్రస్తుతానికి క్లారిటీ లేదు. తేజ స్వయంగా సినిమా నిర్మిస్తారా? లేక బయట నిర్మాత ఎవరైనా సినిమా అని నిర్మిస్తారా? అనే విషయం మీద క్లారిటీ రావాల్సి ఉంది.

# ప్రియదర్శితో సమంత మూవీ..?

స్టార్ బ్యూటీ సమంత గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. మయోసైటిస్ కారణంగా కొన్నాళ్లు సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె ప్రస్తుతం మళ్లీ రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది. ప్రస్తుతం సెలెక్టివ్ గా సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు చేసుకుంటూ వెళ్తోంది. తాజాగా ఆమె నటిస్తున్న "సిటాడెల్: హనీ బన్నీ" వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఇదిలా ఉండగా, ఆమె సెలెక్టివ్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. ఆమె చివరి చిత్రం విజయ్ దేవరకొండతో తీసిన ఖుషి సినిమా. ఇది బాక్సాపీసు వద్ద యావరేజ్ గా నిలిచింది. తన సొంత ప్రొడక్షన్ హౌస్ ట్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై తనే లీడ్ క్యారెక్టర్ లో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించింది. తాజాగా మరో సినిమాను నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఆమె హీరోయిన్‌గా నటించబోతుందట. అయితే, ఈ సినిమాలో ఆమె టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శితో రొమాన్స్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రియదర్శితో సమంత జోడీ కట్టనుందన్న వార్త ప్రస్తుతం అభిమానుల్లో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తుంది. ఇక సమంత పలు చిన్న సినిమాలను తన సొంత బ్యానర్‌పై నిర్మించేందుకు సిద్ధమవుతోంది. మరి ప్రియదర్శి-సమంత కాంబినేషన్‌లో నిజంగానే సినిమా వస్తుందా లేదా అనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు చూడాల్సిందే.




2025 సంక్రాంతి సినిమాల విడుదల ప్రహసనం ఏ సస్పెన్స్ థ్రిల్లర్ కు తీసిపోని రీతిలో జరుగుతోంది. ముందు వస్తామని చెప్పిన విశ్వంభర ఏకంగా అయిదు నెలలు వాయిదా వేసుకునే పనిలో ఉంది. క్రిస్మస్ రిలీజని ప్రచారమైన గేమ్ ఛేంజర్ ఇప్పుడు దాని స్థానంలో రావడం మెగా ఫ్యాన్స్ కి కొంత సంతోషాన్ని కొంత బాధని మిగిల్చింది. బాలయ్య 109 టైటిల్ నిర్ణయం జరగ్గానే డేట్ ని లాక్ చేస్తారు. జనవరి 12 ఆల్రెడీ ప్రచారంలోకి వచ్చింది కానీ అఫీషియల్ స్టాంప్ లేదు. తండేల్ ని పండక్కు తేవాలా వద్దానే మీమాంసలో అల్లు అరవింద్, బన్నీ వాస్ ఉన్నారు. ఇది మిస్ అయితే రిపబ్లిక్ డే టార్గెటవుతుంది. ఇక అసలు విషయానికి వస్తే పక్కా ప్లానింగ్ తో వేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న వెంకటేష్ %-% దర్శకుడు అనిల్ రావిపూడిల సినిమాని సంక్రాంతి రేసు నుంచి తప్పించాలనే ఆలోచనలో నిర్మాత దిల్ రాజు ఉన్నారట. ఇది ఖరారుగా చెప్పకపోయినా లీకు రూపంలో బయటికి రావడంతో వెంకీ ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ బ్యానర్ నుంచే గేమ్ ఛేంజర్ లాంటి ప్యాన్ ఇండియా మూవీ వస్తున్నప్పుడు కేవలం రెండు మూడు రోజుల గ్యాప్ లో వెంకటేష్ సినిమా తేవడం ఎంతవరకు సబబనే కోణంలో రాజుగారు నిర్ణయం మార్చుకోవచ్చని అంటున్నారు. దీనికి అనుకున్న టైటిల్ కూడా సంక్రాంతికి వస్తున్నాం. సో ఇప్పటికిప్పుడు ఎవరు వస్తారు ఎవరు తప్పుకుంటారనేది ఖచ్చితంగా చెప్పలేం. ఇంకా సందీప్ కిషన్ మజాకాతో పాటు బెల్లకొండ సాయిశ్రీనివాస్ %-% నారా రోహిత్ %-% మంచు మనోజ్ చేస్తున్న గరుడన్ రీమేక్ కూడా సంక్రాంతికేననే ప్రచారం ఊపందుకుంది. అజిత్ గుడ్ బ్యాడ్ అగ్లీ డేట్ గురించి తమిళ వర్గాల్లో పొంగలనే చెబుతున్నారు. మరి వెంకటేష్ తప్పుకునేందుకు ఒప్పుకుంటారానే ప్రశ్న ఉత్పన్నం కాదు. నిర్మాత నిర్ణయానికి గౌరవమిచ్చే వెంకీ ఒకవేళ దిల్ రాజు నిజంగా అడిగితే మీ ఇష్టమనే అంటారు తప్ప మొండిపట్టు పట్టరు. చివరికి ఈ రిలీజుల ప్లానింగ్ లో ఎలాంటి ట్విస్ట్ ఉండబోతోందో.

# వెంకీ మామ తప్పుకుంటే లెక్కలు మారిపోతాయ్



# చందూ మొండేటి.. మళ్ళీ వారితోనే..

చందూ మొండేటి.. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ కు ఇండస్ట్రీలో మంచి గుర్తింపు ఉన్న విషయం తెలిసిందే. వరుస హిట్స్ తో సూపర్ క్రేజ్ దక్కించుకున్నారు. రీసెంట్ గా తెలుగు సినిమా గర్వించే క్షణాలను చిత్ర పరిశ్రమకు అందించారు. ఆయన తెరకెక్కించిన కార్తికేయ 2 ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ పురస్కారాన్ని గెలుచుకుంది. ప్రస్తుతం యంగ్ హీరో నాగచైతన్య తండేల్ మూవీతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే.నాగచైతన్య, చందు మొండేటి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న తండేల్ మూవీపై ఇప్పటికే ఆడియెన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన కొందరు మత్స్యకారుల నిజ జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా చందు తెరకెక్కిస్తున్నారు. చాలా నేచురల్ గా మూవీని తీస్తున్నట్లు ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ద్వారా క్లారిటీ వచ్చింది. వచ్చే ఏడాది సంక్రాంతికి మూవీ రిలీజ్ కానున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే తండేల్ తర్వాత.. చందు నెక్స్ట్ ఏంటన్నది ఇంకా క్లారిటీ లేదు. ఏ హీరోతో వర్క్ చేస్తారన్న విషయంపై ఇప్పటి వరకు ఆయన ఎలాంటి అనౌన్స్మెంట్ ఇవ్వలేదు. కొద్ది రోజుల క్రితం మాత్రం.. తండేల్ నిర్మిస్తోన్న గీతా ఆర్ట్స్ బ్యానర్ పైనే మరో మూవీ చేయనున్నారని జోరుగా ప్రచారం సాగింది. ఇప్పుడు అదే నిజమని తెలుస్తోంది. భారీ బడ్జెట్ తో గీతా ఆర్ట్స్ ఆ మూవీని నిర్మించనుందని సమాచారం. ఇప్పటికే చందు.. కథను సిద్ధం చేసుకున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.పీరియాడికల్ డ్రామాగా చందు తెరకెక్కించనున్నారని.. లీడ్ రోల్ లో బాలీవుడ్ స్టార్ హీరో నటించనున్నారని టాక్ వినిపిస్తోంది. అంతే కాదు.. బీ టౌన్ కు చెందిన ఓ బడా ప్రొడక్షన్ హౌస్ నిర్మాణంలో భాగమవ్వనుందని వినికిడి. తండేల్ అయ్యాక.. వెంటనే ఆ ప్రాజెక్టుతో చందూ మొండేటి బిజీ అవ్వనున్నారని తెలుస్తోంది. త్వరలోనే ఆ క్రేజీ ప్రాజెక్ట్ కు సంబంధించి అన్ని విషయాలు అనౌన్స్ చేయనున్నారని సమాచారం. అయితే గీతా ఆర్ట్స్ కొంతకాలంగా భారీ చిత్రాలపై దృష్టి సారించడం లేదనే చెప్పాలి. చిన్న, మీడియం సినిమాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. జీఏ 2 సంస్థ వాటి బాధ్యతలను చూసుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పుడు తండేల్ మూవీతో మళ్లీ భారీ చిత్రాల బాట పట్టింది. చైతూ కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ మూవీగా తండేల్ ను నిర్మిస్తోంది. ఇక చందూ మొండేటి, బాలీవుడ్ హీరో కాంబో ప్రాజెక్టును కూడా భారీ బడ్జెట్ తో రూపొందించనుంది. అల్లు అర్జున్, త్రివిక్రమ్ మూవీని కూడా ప్రొడ్యూస్ చేసేందుకు సిద్ధం చేస్తోంది. మరి గీతా ఆర్ట్స్ రాబోయే రోజుల్లో ఎలాంటి హిట్స్ అందుకుంటుందో చూడాలి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613